నీటి కోసం నిత్యం తిప్పలు

సింగరేణిలో 30 ఏళ్లుగా వాటర్‌ ట్యాంకర్లపైనే ఆధారం ● పనులు మానుకొని ఎదురు చూపులు

సైదాబాద్‌: హైదరాబాద్‌ మహానగరంలోనే అతి పెద్ద మురికివాడల్లో ఒకటైన సింగరేణి కాలనీ ఒకటి. ఇక్కడి గుడిసెవాసులు తాగునీటి కోసం నిత్యం అష్టకష్టాలు పడుతున్నారు. ఐఎస్‌సదన్‌ డివిజన్‌ పరిధిలోని ఈ మురికివాడలో బడుగు, బలహీన వర్గాల వారే అధికం. పలు జిల్లాల నుంచి బతుకు దెరువు కోసం నగరానికి వలస వచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. పదిహేను వేలకుపైగా కుటుంబాలు నివసించే సింగరేణి కాలనీలో అత్యధిక మంది నిత్యం పని చేసుకుంటేనే పూట గడుస్తుంది. అంతటి క్లిష్ట పరిస్థితుల్లోనూ చాలా సందర్భాల్లో పనులు మానుకొని వాటర్‌ ట్యాంకర్ల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. నీటి కోసం పనులు మానుకొన్న రోజున పస్తులు ఉండాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కుటుంబాల్లోని పిల్లలు పాఠశాలకు వెళ్లటం మానేసి తాగునీరు పట్టుకోవడానికి ఇంటి వద్దనే ఉండిపోతున్నారు.



వాటర్‌ ట్యాంకర్‌ వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు, చిన్నారులు

30 ఏళ్లుగా ట్యాంకర్లపైనే ఆధారం...

వివిధ జిల్లాల నుంచి వలస వచ్చిన వారు 30 సంవత్సరాలుగా ఇక్కడి ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. అప్పటి నుండి ఇప్పటికీ వారు వాటర్‌ వర్క్స్‌ విభాగం వారు సరఫరా చేసే వాటర్‌ ట్యాంకర్లపైనే తాగునీటి కోసం ఆధారపడుతున్నారు. రోజు విడిచి రోజు చొప్పున వచ్చే ట్యాంకర్లే వారి అన్ని అవసరాలకు దిక్కు. సింగరేణి కాలనీలోని గుడిసె వాసుల కోసం 13 ట్యాంకర్లు నిత్యం సుమారు 100 ట్రిప్పులు నడుపుతున్నారు. ముఖ్యంగా వేసవికాలంలో ఏ ట్యాంకర్‌ డ్రైవర్‌ అయినా విధులకు రాక పోతే ఆ రోజుకు ఆ ట్యాంకర్‌ ట్రిప్పులు నడవడం లేదు. దాంతో ఆ ట్యాంకర్‌ కోసం రోజంతా ఎదురు చూస్తూ పలువురు గుడిసెవాసులు ఇబ్బందులు పడుతున్నారు. సదరు ట్యాంకర్‌ యజమాని కానీ, అధికారులు కానీ ఈ విషయంలో ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోక పోవడం వల్ల గుడిసె వాసులకు కష్టాలు తప్పటం లేదు. గత ప్రభుత్వాల హయాంలోనే బస్తీలు, మురికివాడలలోని ప్రజల ఇళ్లకు ఒక్క రూపాయికి వాటర్‌ కనెక్షన్‌ పథకం అమలు చేశారు. కానీ ఆ పథకాన్ని సింగరేణి కాలనీలో అమలు చేయడానికి అధికారులు తాత్సారం చేస్తున్నారు.



సింగరేణి కాలనీలో నీటి నిల్వ కోసం డ్రమ్ములు ఏర్పాటు చేసుకున్న గుడిసెవాసులు

శాశ్వత పరిష్కారం చూపాలి



నిరుపేదలు అత్యధికంగా నివసించే సింగరేణి కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలం అవుతున్నారు. ఇంటింటికి మంచి నీటి కనెక్షన్‌ ఏర్పాటు చేస్తేనే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. అందుకోసం గుడిసెవాసులతో కలిసి పోరాటం చేస్తాం.

\- షేక్‌ మహమూద్‌, ఐఎస్‌సదన్‌ డివిజన్‌ సీపీఐ కార్యదర్శి

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

చంపాపేట: మరమ్మతుల పనుల కారణంగా చంపాపేట సబ్‌ స్టేషన్‌ పరిధిలో శనివారం విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌ తెలిపారు. సుల్తానా అల్వా 33/11 కేవీ ఫీడర్‌ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కటకోనికుంట, చంపాపేట పాత బస్తీ, సాయిరాంనగర్‌, సుల్తానా అల్వా, బస్తీ దవాఖానా పరిధి, రాజిరెడ్డినగర్‌ కాలనీల్లో విద్యుత్‌ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు.

రైతుబజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్‌ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్‌ రూ.17, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.19, ఉల్లిగడ్డ రూ.39, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.28, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.40, చామగడ్డ రూ.45, మునగ రూ.55, కందగడ్డ రూ.60, బీట్‌రూట్‌ రూ.18, కీర రూ.23, బీన్స్‌ రూ.35, క్యాప్సికమ్‌ రూ.35. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

నేడు ప్రాపర్టీ ట్యాక్స్‌ పరిష్కార కార్యక్రమం

చాదర్‌ఘాట్‌: జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆదేశాల మేరకు శనివారం ప్రాపర్టీ ట్యాక్స్‌ పరిష్కార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మలక్‌పేట్‌ సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ జయంత్‌ తెలిపారు. శుక్రవారం మలక్‌పేట్‌లో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ట్యాక్స్‌ సమస్యలు, ఆస్తి పన్ను అంచనాలు, ఆన్‌లైన్‌ బకాయిల సవరణ వంటి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని పన్ను చెల్లింపుదారులు వినియోగించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9989930213 ఫోన్‌ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఓపెన్‌ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఓపెన్‌ జిమ్‌ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్‌ వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్‌ కర్మన్‌ఘాట్‌ ప్రాంతంలోని క్రాంతి క్లబ్‌ ఖాళీ స్థలంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్‌ జిమ్‌ను పరిసర కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక డివిజన్‌ కార్పొరేటర్‌ వంగ మధుసూదన్‌రెడ్డి కోరారు. రూ.9.50 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్‌ జిమ్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, దశరథ్‌గౌడ్‌, శేఖర్‌గౌడ్‌, సుంకరి రమేష్‌, శ్రీధర్‌, వేణు, కృష్ణ, తిరుమలేష్‌ తదితరులు పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: పంజేషాహలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అహ్మద్‌ బలాల గురువారం రాత్రి సైదాబాద్‌ మండలానికి చెందిన 23 మంది లబ్ధిదారులకు షాదీముబారక్‌, కల్యాణలక్ష్మీ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందరికీ అందే విధంగా కృషి చేస్తామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సుధీర్‌కుమార్‌కు ఘనంగా నివాళి



సైదాబాద్‌: ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే పంజాల సుధీర్‌కుమార్‌ ఆశయ సాధనకు పాటుపడతామని కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ సీనియర్‌ నేత ఎ.మదన్‌బాబు అన్నారు. సుధీర్‌కుమార్‌ జయంతి సందర్భంగా శుక్రవారం సైదాబాద్‌లో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మీనగర్‌ కాలనీలోని శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు కృషి

స్టాండింగ్‌ కమిటీ మెంబర్‌ సుజాత నాయక్‌



హస్తినాపురం: జీహెచ్‌ఎంసీ స్టాండింగ్‌ కమిటీ మెంబర్‌గా హస్తినాపురం డివిజన్‌ కార్పొరేటర్‌ బానోతు సుజాత నాయక్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం కార్పొరేటర్‌ సుజాత నాయక్‌ 'సాక్షి'తో మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ నుంచి పెద్దఎత్తున నిధులను మంజూరు చేయించి ఎల్‌బీనగర్‌ నియోజకవర్గంలోని 11 డివిజన్ల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. నాపై నమ్మకం ఉంచి స్టాండింగ్‌ కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి అన్ని విధాలుగా కృషి చేసిన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కీగౌడ్‌కు సుజాతనాయక్‌ కృతజ్ఞతలు తెలిపారు.

ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఇంటర్‌ విద్యార్థిని అదృశ్యం



కనిపించకుండా పోయిన మీనాక్షి

నాగోలు: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఇంటర్‌ విద్యార్థిని కనిపించకుండాపోయిన సంఘటన నాగోలు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నాగోలు జైపురికాలనీలో నివాసం ఉండే వాక నాగబాబు కుమార్తె మీనాక్షి(16) చైతన్యపురిలోని శ్రీచైతన్య జూనియర్‌ కళాశాలలో ఇంటర్మీడియట్‌ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ నెల 16 వ తేదీన కళాశాల వెళ్లి ఇంటికి వచ్చిన మీనాక్షి వారి కుటుంబం నడుపుతున పానీపూరి స్టాల్‌ వద్దకు వచ్చింది. కుటుంబ సభ్యులకు కడుపు నొప్పిగా ఉందని చెప్పడంతో ఆమె తల్లిదండ్రులు ఆమెను ఇంటికి వెళ్లమని చెప్పి అక్కడ నుండి పంపించారు. తల్లి రాత్రి 8 గంటల సమయంలో కుమార్తెకు ఫోన్‌ చేయగా ఎవరూ స్పందించలేదు. వెంటనే ఇంటికి వెళ్లి చూడగా ఇంట్లో మీనాక్షి కనిపించలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ఇతర ప్రాంతాలల్లో వెతికిన ప్రయోజనం లేకపోవడంతో శుక్రవారం నాగోలు పోలీస్‌ స్టేషన్‌ తండ్రి నాగబాబు ఇచ్చిన ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌

మహేశ్వరం: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జల్‌పల్లి మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తున్నారని రంగారెడ్డి జిల్లా దిశ కమిటీ సభ్యుడు అంబోజీ శ్రీనివాస్‌ పేర్కొన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీకి గడిచిన ఆరేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలైన నిధుల వివరాలు ఇవ్వాలని శుక్రవారం ఆయన మున్సిపల్‌ కమిషనర్‌ వెంకట్రామ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంబోజీ శ్రీనివాస్‌ మాట్లాడుతూ....2018 నుంచి 2025, జనవరి 31వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వ పథకాలైన అమృత్‌ మిషన్‌, ప్రధానమంత్రి ఆవాస్‌యోజన, స్వచ్ఛభారత్‌, స్మార్ట్‌ సిటీ మిషన్స్‌ ద్వారా విడుదలైన నిధులు, పూర్తయిన పనుల వివరాలు ఇవ్వాలని కోరారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే మున్సిపల్‌ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతున్నాయని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు జిల్లా వ్యాప్తంగా అమలయ్యే విధంగా దిశా కమిటీ చైర్మన్‌, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఈ క్రమంలోనే మహేశ్వరం నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తున్నామని, అందులో భాగంగానే జల్‌పల్లి సమాచారాన్ని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్‌ ఎనగండ్ల శ్రీధర్‌ గౌడ్‌, నాయకులు గొరిగె మల్లేష్‌, సంతోష్‌, బాల శివుడు పాల్గొన్నారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్లో ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా చేపట్టిన పనులు, నిధుల వివరాలను సమర్పించాలని జిల్లా దిశా కమిటీ సభ్యులు అంబోజి శ్రీనివాస్‌ శుక్రవారం కమిషనర్‌ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం నిధులతో రాష్ట్రంలోని గ్రామ పంచాయితీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో అభివృద్ధి జరుగుతోందని, పథకాలు జిల్లా వ్యాప్తంగా అమలయ్యేలా కమిటీ చైర్మన్‌, చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. ఆయన వెంట బీజేపీ అధ్యక్షుడు పసునూరి భిక్షపతిచారి, మాజీ కార్పొరేటర్లు పెండ్యాల నర్సింహ, కీసర గోవర్ధన్‌రెడ్డిలు ఉన్నారు.

యథేచ్ఛగా బెల్టుషాప్‌ల నిర్వహణ

● పట్టించుకోని పోలీసులు

మహేశ్వరం: పహాడీషరీఫ్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో బెల్టుషాప్‌లకు అడ్డూ అదుపులేకుండా పోతుంది. పగలు, రాత్రి తేడా లేకుండా మద్యం విక్రయాలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. మందుబాబులు 24 గంటల పాటు మత్తులోనే తూలుతున్నారు. శ్రీరాం కాలనీ, జల్‌పల్లి, మామిడిపల్లి, బాలాజీ కాలనీ, రంగ నాయకుల కాలనీ, దేవేందర్‌ కాలనీ, పహాడీ షరీఫ్‌ గ్రామం, సర్దార్‌నగర్‌, తుక్కుగూడ, మంఖాల్‌, హర్షగూడలలో బెల్టుషాప్‌లను నడుపుతున్నారు. బతుకుదెరువు కోసం వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న వలస కార్మికులతో పాటు స్థానిక ప్రజలు విచ్చలవిడిగా మద్యం అందుబాటులో ఉండడంతో ఎంచక్కా లేచింది మొదలు అదే పనిలో ఉంటున్నారు. వెరసి ఆరోగ్యాలు పాడు చేసుకుంటుడడంతో పాటు తాగిన మైకంలో నేరాలకు పాల్పడుతున్నారు. బెల్టు షాప్‌లు ఇంత దర్జాగా నడుపుతున్నా ఎక్సైజ్‌ అధికారులు, స్థానిక పోలీసులు చూసి చూడనట్లుగా వ్యవహరించడం పలు ఆరోపణలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

26న బ్యాడ్మింటన్‌ టోర్నమెంట్‌

హయత్‌నగర్‌: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని హయత్‌నగర్‌ గజ్జి రాజమ్మ, యాదయ్య యాదవ్‌ జ్ఞాపకార్థం ఎస్‌వీ బ్యాడ్మింటన్‌ అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక నైట్‌ బ్యాడ్మింటన్‌ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గజ్జి నర్సింహ యాదవ్‌, రాజారావ్‌ తెలిపారు. ఈ నెల 26 సాయంత్రం నుంచి 27 ఉదయం వరకు ఎస్‌వీఎస్‌ ఇండోర్‌ స్టేడియంలో జరిగే ఈ పోటీలలో విజేతలకు లక్ష రూపాయల వరకు నగదు బహుమతులను అందజేస్తామని పేర్కొన్నారు. మెన్స్‌ డబుల్‌ ఓపెన్‌, ప్లస్‌ 45 విభాగాలలో పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గలవారు. ఈ నెల 25 వరకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని వివరాలకు 97045 41570, 98499 56055 ఫోన్‌ నెంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

పరమేశ్వర మహదేవ్‌ ఆలయంలో ప్రత్యేక పూజలు



పరమేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్‌ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్‌: బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ పరిధిలోని వినాయక హిల్స్‌ కాలనీలో జాట్‌ సమాజ్‌ ట్రస్ట్‌, కమ్యూనిటీ ఆధ్వర్యంలో నిర్మించిన పరమేశ్వర మహదేవ్‌ ఆలయ ప్రారంభోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రారంభోత్సవంలో స్థానిక కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జాట్‌ కమ్యూనిటీ అధ్యక్షుడు దూద్రం బాబా, సభ్యులు గౌతమ్‌ సేటు, నాయకులు విష్ణువర్ధన్‌ రెడ్డి, పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివ భక్తులకు అన్నదానం



సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని సైదాబాద్‌ భాగ్యనగర్‌ శివ దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో శివరాత్రి సందర్భంగా పాదయాత్ర చేసిన భక్తులకు ఈ నెల 19 నుంచి 21 వరకు దోమలపెంట చెక్‌పోస్టు వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఈ నెల 24 వరకు కొనసాగుతుంది. అన్నదాన కార్యక్రమాన్ని 15 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. ఇందులో సేవా సమితి ప్రతినిధులు జ్ఞానేశ్వర్‌, కిరణ్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు పంపిణీ

బడంగ్‌పేట్‌: కార్పొరేషన్‌ పరిధిలోని బాలాపూర్‌కు చెందిన జెట్టి భిక్షపతి అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన చికిత్స కోసం ప్రయివేట్‌ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నారు. జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి రూ.60 వేల చెక్కును శుక్రవారం మాజీ మేయర్‌ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి బాధితునికి అందచేశారు.

హోర్డింగ్‌ వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి



మధుయాష్కీగౌడ్‌కు సమస్యలను వివరిస్తున్న హోర్డింగ్‌ వ్యాపారస్తులు

లింగోజిగూడ: ప్రకటనల హోర్డింగ్‌ వ్యాపారుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కీగౌడ్‌ అన్నారు. ఈ మేరకు పలువురు హోర్డింగ్‌ వ్యాపారులు శక్రవారం మధుయాష్కీగౌడ్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు హోర్డింగ్‌లను హైడ్రా తొలగించడంతో రోడ్డు మీద పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పట్లో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం నగరంలో హోర్డింగ్‌లను అడ్డుకోవడంతో శివారు మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. బీఆర్‌ఎస్‌ కారణంగా ఇబ్బంది పడటంతో గత ఎన్నికలలో కాంగ్రెస్‌ పార్టీకి మద్దతు ఇచ్చామని చెప్పారు. హోర్డింగ్‌ల వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్న సుమారు 10 వేలమంది ఆధార పడి జీవిస్తున్నారని, తమకు అండగా నిలవాలని తెలిపారు. ఈ మేరకు మధుయాష్కీ గౌడ్‌ సానుకూలంగా స్పందించారు.

సమస్యలు పరిష్కరించాలని ఇలంబర్తికి వినతి



జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఇలంబర్తికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్‌ పవన్‌కుమార్‌

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో మూసీ నదీ పరీవాహక ప్రాంతంలో వర్షాకాలంలో భారీ వరదలు సంభవిస్తున్నాయని, వాటి బారి నుంచి రక్షించేందుకు వివిధ కాలనీలలో బాక్స్‌ డ్రైనేజీని మంజూరు చేయాలని కొత్తపేట డివిజన్‌ కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌కుమార్‌ జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఇలంబర్తిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పవన్‌కుమార్‌ మాట్లాడుతూ డివిజన్‌ పరిధిలోని న్యూ నాగోల్‌, సమత పూరి, రాఘవేంద్ర కాలనీ, మోహన్‌ నగర్‌, గాయత్రి పురం కాలనీ, నాగేశ్వర్‌ నగర్‌ కాలనీ, శ్రీ రామలింగేశ్వర కాలనీలలో బాక్స్‌ డ్రైనేజ్‌ ఏర్పాటు చేయించాలని కోరారు. కొత్తపేట డివిజన్‌లోని కమ్యూనిటీ హాళ్ల మరమ్మతులు, అభివృద్ధి కోసం నిధుల కేటాయించాలని విన్నవించారు. వివిధ కాలనీలలో అంతర్గత రోడ్లు పాడైపోయి ప్రజలు నడవలేని స్థితిలో ఉన్నాయని చెప్పారు. వెంటనే నూతన రోడ్లను మంజూరు చేయాలని కోరారు. డివిజన్‌ పరిధిలో పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు కమిషనర్‌ స్పందిస్తూ కొత్తపేట డివిజన్‌కు రెండు కోట్ల రూపాయలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్‌ పవన్‌ కుమార్‌ తెలిపారు.

ప్రైవేట్‌ పోటీని తట్టుకునేవిధంగా ప్రత్యేక శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతన్న ఆర్‌ఎం సుచరిత

హయత్‌నగర్‌: ప్రైవేట్‌ వాహనాల పోటీని తట్టుకొని ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించేందుకు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని టీఎస్‌ఆర్టీసీ హైదరాబాద్‌ రీజినల్‌ మేనేజర్‌ సుచరిత అన్నారు. శుక్రవారం హయత్‌నగర్‌–1 బస్‌ డిపోలో జరుగుతున్న పవర్‌ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చిన తర్వాత సంస్థ అభివృద్ధిపథంలో నడుస్తున్నా సిబ్బందికి పని భారం పెరిగిందన్నారు. పని ఒత్తిడితో పాటు పోటీని తట్టుకునేందుకు పవర్‌ పేరుతో శిక్షణ ఇస్తున్నామని, ప్రయాణికుల నమ్మకాన్ని దృష్టిలో ఉంచుకుని భద్రమైన ప్రయాణం, మెరుగైన సేవలను అందించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. డిపో మేనేజర్‌ జలగం విజయ్‌ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సహాయ మేనేజర్‌లు విజయకుమారి, సత్తయ్య, సిబ్బంది మైస నరేష్‌, మహిపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

బాంబు పేలుళ్ల మృతులకు నివాళులు



బాంబు పేలుళ్ల మృతులకు నివాళులర్పిస్తున్న యాంటీ టెర్రరిస్ట్‌ ఫోరం నాయకులు

చైతన్యపురి: యాంటీ టెర్రరిజం ఫోరం(ఏటీఎఫ్‌) ఆధ్వర్యంలో శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్‌ జంట పేలుళ్ల మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏటీఎఫ్‌ చైర్మన్‌ డాక్టర్‌ రావినూతల శశిధర్‌ మాట్లాడుతూ దిల్‌సుఖ్‌నగర్‌ బాంబు పేలుళ్లలో ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటంబాలను ప్రభుత్వం ఇప్పటి వరకు ఆదుకోకపోవటం విచారకరమన్నారు. దేశంలో ఎక్కడ ఉగ్రకోణం వెలికి చూసినా దాని మూలాలు తెలంగాణలో, హైదరాబాద్‌లో బయటపడటం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. కార్యక్రమంలో ఏటీఎఫ్‌ కన్వీనర్‌ బ్రహ్మచారి, సభ్యులు నవీన్‌, అనంతాచారి, మనోజ్‌, మహేష్‌, సుధీర్‌, రాజేందర్‌, రాజు, శ్రీశైలం, పాండు, బద్రినాథ్‌, అనిత్‌ తదితరులు పాల్గొన్నారు.

రోస్టర్‌ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలి



సత్యనారాయణను సన్మానిస్తున్న జీఎస్‌ఐ ఉద్యోగులు

మన్సూరాబాద్‌: జియోలాజికల్‌ సర్వే ఆఫ్‌ ఇండియా(జీఎస్‌ఐ)లో రిజర్వేషన్‌ రోస్టర్‌ ప్రక్రియను సక్రమంగా నిర్వహించేందుకు కృషి చేయాలని, ప్రక్రియను ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆలిండియా జీఎస్‌ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్‌ వెల్ఫేర్‌ అసోయేషన్‌ రీజినల్‌ సెక్రటరీ మధిర సత్యనారాయణ కోరారు. జీఎస్‌ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జీఎస్‌ఐలోని మల్టీపర్పస్‌ హాల్‌లో శుక్రవారం రీజినల్‌ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జీఎస్‌ఐ ఏడీజీ, హెచ్‌ఓడీ సూరజ్‌ దోమజీ పట్‌బాజే, మధిర సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా రీజినల్‌ సెక్రటరీ సత్యనారాయణ మాట్లాడుతూ జీఎస్‌ఐలోని ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్‌ ఖాళీలను వెంటనే భర్తీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ చైర్మన్‌ ఆదర్ల మహేష్‌, ప్రతినిధులు లింగ్య, రాజశేఖర్‌, కుమార్‌, చంద్రయ్య, చక్రేశ్వర్‌, శివశంకర్‌, దయానంద్‌, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్‌ఐ ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ కమిటీ ఎన్నిక



మన్సూరాబాద్‌: జియోలాజికల్‌ సర్వే ఆఫ్‌ ఇండియా(జీఎస్‌ఐ) ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ 25వ ప్రాంతీయ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కె.అనిల్‌కుమార్‌, వైస్‌ చైర్మన్‌లుగా బి.శ్రీనివాసరావు, ఎం.రవీందర్‌, ప్రధాన కార్యదర్శిగా సాయిబాబ, సహాయ ప్రధాన కార్యదర్శిగా నితేష్‌సింగ్‌, ఆర్థిక కార్యదర్శిగా మాధవ రావు, కార్యవర్గ సభ్యులుగా జగదీష్‌, తులసీబాయి, భవానీ, సతీష్‌కుమార్‌, అక్బర్‌ ఖాన్‌, శంకర్‌సింగ్‌, అమీర్‌ఖాన్‌ ఎన్నికైనట్లు నూతన అధ్యక్షుడు అనిల్‌కుమార్‌ తెలిపారు. నూతన కమిటీని జీఎస్‌ఐ ఏడీజీ, హెచ్‌ఓడీ సూరజ్‌ డి.పట్‌బాజే అభినందించారు.

ఐఎన్‌టీయూసీ బలోపేతానికి కృషి

నాగోలు: రాష్ట్రంలో ఐఎన్‌టీయూసీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని ఐఎన్‌టీయూసీ స్టేట్‌ ఆర్గనైజింగ్‌ సెక్రటరీ పెద్దవూర బ్రహ్మయ్య అన్నారు. శుక్రవారం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్న గౌడ్‌ను వారి నివాసంలో మర్యాద పూర్వంగా కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా పెద్దవూర బ్రహ్మయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐఎన్‌టీయూసీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు యూనియన్‌ సభ్యులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ బిల్డింగ్‌ వర్కర్స్‌ యూనియన్‌ సభ్యులు వెంకటేష్‌, కె.బ్రహ్మయ్య, లాలు, లక్ష్మయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.



ఐఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శి నాగన్న గౌడ్‌ను సన్మానిస్తున్న బ్రహ్మయ్య తదితరులు